హుండీ దొంగల రిమాండ్‌

చందానగర్‌ : ఇటీవల చందానగర్‌ పరిధిలోని దేవాలయాల్లో హుండీ చోరీలకు పాల్పడిన దొంగలను బుధవారం చందానగర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాస్‌ కుమార్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గాజులరామారం రోడా మేస్త్రీనగర్‌కు చెందిన శుభమ్‌ సింగ్‌, మహమ్మద్‌ అన్వర్‌, ధర్మేష్‌ మేస్త్రీలుగా పని చేసేవారు. వీరు ముగ్గురూ ముఠాగా ఏర్పడి గంగారం హనుమాన్‌ దేవాలయం, హుడా కాలనీలోని సాయిబాబా ఆలయంలో హుండీలను పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. బుధవారం వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 15 తులాల వెండి, 0.5 గ్రాముల బంగారం బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠాను పట్టుకున్నందుకు సీఐ విజయ్‌, డీఐ భాస్కర్‌, క్రైం పోలీస్‌ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి: అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి సూచించారు. రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు నులిపురుగుల, ఫైలేరియా నిర్మూలనకు ఎంతో కృషి చేస్తుందని వివరించారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నులిపురుగల నివారణకు ఉచిత మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు సి.గోదావరి, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రభుత్వ సంస్థల్ని కాపాడుకోగలం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌.వీరయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఐక్య పోరాటలతోనే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోగలుగుతామని రాష్ట్ర సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్‌.వీరయ్య పేర్కొన్నారు. బెల్‌ టౌన్‌షిప్‌లో బుధవారం నిర్వహించిన బీహెచ్‌ఈఎల్‌ సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య, నాయకులు పెంటయ్య, శ్రీనివాస్‌, నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మాదాపూర్‌ ట్రాఫిక్‌ పోలీసులు

గచ్చిబౌలి: ఆటో డ్రైవర్లకు మాదాపూర్‌ ట్రాఫిక్‌ పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం రాయదుర్గం మెట్రో స్టేషన్‌ వద్ద ఆటో డ్రైవర్లతో మాదాపూర్‌ ట్రాఫిక్‌ పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. రోడ్డు మధ్యలో, ట్రాఫిక్‌ అంతరాయం కలిగించేలా ఆటోలను నిలపవద్దన్నారు. లైసెన్స్‌, ఆర్‌సీతో పాటు అన్ని డాక్యుమెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్‌ పుష్ప అన్నారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని 12వ బ్లాక్‌లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పైపులైన్‌ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పైపులైన్‌ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనులు జరిగే సమయంలో ఇంజనీరింగ్‌ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు మహేందర్‌రెడ్డి, సత్యనారయణ, అశోక్‌, సురేందర్‌, యాదయ్య, అరుణ్‌, బాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమాన, మరో ఇద్దరికి రూ. 1500, ఒకరికి రూ.2 వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

సర్కారు బడి.. సమస్యల బడి

- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- 40 గజాల్లోనే పాఠశాల నిర్మాణం
- ఉపాధ్యాయుల కొరతతో కొరవడిన విద్యాబోధన



చందానగర్‌లోని వేమన వీకర్‌ సెక్షన్‌లోని ప్రాథమిక పాఠశాల

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని వేమన వీకర్‌ సెక్షన్‌లో ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం 'మన ఊరు మన బడిలో' భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసింది. పేద విద్యార్థులకు ప్రైవేట్‌ పాఠశాలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వాటికి తగ్గట్లుగా మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రభుత్వం మారడంతో 'మన ఊరు మన బడి' పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. పేద ప్రజలకు నిలయమైన వీకర్‌ సెక్షన్‌ కాలనీలో 2002 ప్రారంభమైన ఈ పాఠశాలలో ఇప్పటి వరకు కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఇద్దరే విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల సమస్యలపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చందానగర్‌ వేమన వీకర్‌ సెక్షన్‌ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలు ఇవీ....

- రెండు గదుల్లోనే ఐదు తరగతులు కొనసాగుతున్నాయి.
- విద్యార్థులు ఆడుకోవడానికి ఖాళీ స్థలం లేదు.
- మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ మరుగుదొడ్లు నిర్మించినా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.
- 5 తరగతులు విద్యార్థులు రెండు గదుల్లోనే సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- మంచినీటి ట్యాంక్‌ లేక పోవడంతో బిందెలతో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

వంట గదిని నిర్మించాలి


పాఠశాల ముందు ఉన్న ఖాళీ స్థలంలో అంగన్‌వాడి గదితో పాటు వంటశాల నిర్మించాలి. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలం ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి.
– మల్లేష్‌, వేమన వీకర్‌ సెక్షన్‌ కాలనీ

పాఠశాలను అభివృద్ధి చేయాలి...


47 మందికి రెండు తరగతి గదులు ఉన్నాయి. కేవలం రెండు గదుల్లో పాఠాలు చెప్పాలంటే టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. పి.జనార్ధన్‌రెడ్డి హయాంలో నిర్మించిన పాఠశాల అభివృద్ధికి అధికారులు చొరవ చూపాలి.
– వెంకటేశ్వర్లు, వేమన కాలనీ



పాఠశాలలో అశుభ్రంగా మరుగుదొడ్లు

విద్యుత్‌ సమస్యలపై అధికారుల పరిశీలన

చందానగర్‌ : విద్యుత్‌ సమస్యలపై వినియోగదారులు నేరుగా విద్యుత్‌ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని చందానగర్‌ డీఈ యాదగిరి, ఏడీఈ ఆదినారాయణ అన్నారు. బుధవారం హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో విద్యుత్‌ సీఎండీ ఆదేశాల మేరకు కాలనీల్లో పర్యటించి వినియోదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కాలనీలు, బస్తీల్లో లో ఓల్టేజ్‌, ఫీజ్‌లు పోవడం, సరఫరాలో అంతరాయం తదితర సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తే తక్షణమే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఈలు, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేష్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌ అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ పరిధిలోని అధికారుల వివరాలు :

డివిజనల్‌ ఇంజనీర్‌ (గచ్చిబౌలి) : 87124 69627
అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ (చందానగర్‌) : 87124 69629
అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (వసంత్‌నగర్‌) : 87124 69635
ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (వసంత్‌నగర్‌) : 87124 69656
అసిస్టెంట్‌ ఇంజనీర్‌(చందానగర్‌) : 87124 69634
ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (చందానగర్‌) : 87124 69655
అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (హఫీజ్‌పేట్‌) : 87124 69636
ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (హఫీజ్‌పేట్‌) : 87124 69657


సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్‌ శాఖ అధికారులు

విద్యుత్‌ బిల్లులు వసూలు చేయాలి

టీజీఎస్‌పీడీసీఎల్‌ చీఫ్‌ ఇంజనీర్‌ పాండ్య

గచ్చిబౌలి: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమర్షియల్‌ సర్వీస్‌ల విద్యుత్‌ బిల్లులు వసూలు చేయని పక్షంలో ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని టీజీఎస్‌పీడీసీఎల్‌ జోనల్‌ చీఫ్‌ ఇంజనీర్‌ పాండ్య అధికారులను హెచ్చరించారు. బుధవారం సైబర్‌సిటీ సర్కిల్‌ కేటగిరి–2, కేటగిరి–2లో మొండి బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బిల్లులు చెల్లించని సర్వీస్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై అధికారులు అనుమతి లేకుండా లైన్‌క్లియర్‌లు తీసుకోవద్దని సూచించారు. విద్యుత్‌ సరఫరా అంతరాయాలకు కారణాలను గుర్తించి వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. అనంతరం బస్తీ బాటలో భాగంగా టీజీఎస్‌పీడీసీఎల్‌ చీఫ్‌ ఇంజనీర్‌ పాండ్య, జనరల్‌ మేనేజర్‌ అంజయ్య రాఘవేంద్ర కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. విద్యుత్‌ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సైబర్‌సిటీ ఎస్‌ఈ చంద్రశేఖర్‌, కొండాపూర్‌ డీఈ శ్యామ్‌ కుమార్‌, ఏడీఈ కమలాకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాఘవేంద్ర కాలనీలో పర్యటిస్తున్న సీజీఎం పాండ్య తదితరులు

హాకీ క్రీడ అభివృద్ధికి చర్యలు


శివ సేనా రెడ్డిని సత్కరిస్తున్న కొండా విజయ్‌ తదితరులు

గచ్చిబౌలి: స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ తెలంగాణ చైర్మన్‌ శివ సేనా రెడ్డిని హాకీ అధ్యక్షుడు కొండా విజయ్‌ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి అభినందనలు తెలిపారు. హాకీ అకాడమిని రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గచ్చిబౌలి స్టేడియంలోని కార్యాలయంలో బుధవారం ఆయన శివసేనా రెడ్డిని కలిసి హాకీ స్టిక్‌ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శివ సేనా రెడ్డి మాట్లాడుతూ హాకీ జిల్లా అకాడమిని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేయడం ద్వారా హాకీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అకాడమిలో శిక్షణ తీసుకునేందుకు 24 మంది బాలికలు, 24 మంది బాలురను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హాకీ రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ కె.భాస్కర్‌ రెడ్డి, ట్రెజరర్‌ పాండు రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిస్టిన్‌ ఐ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ ప్రారంభం

మాదాపూర్‌: ఐటీ నిపుణుల్లో 70శాతం, పట్టణ టీనేజర్లు 40శాతం డ్రై ఐ లక్షణాలను కలిగి ఉన్నారని గ్రేస్‌ కేన్సర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు అంకాలజీ సర్జన్‌ డాక్టర్‌ చినబాబు అన్నారు. ప్రిస్టిన్‌ ఐ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో కళ్లు పొడిబారడం సమస్య నివారణకు మాదాపూర్‌లోని రాయదుర్గం మెట్రో స్టేషన్‌ వద్ద సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ను (ప్రత్యేక కేంద్రాన్ని) ఆయన నిర్వాహకులతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్‌, మొబైల్‌ తదితర స్క్రీన్స్‌ వినియోగదారుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందన్నారు. గతంలో వృద్ధుల్లో ప్రధానంగా కనిపించే డ్రై ఐ డీసీజ్‌ అధిక స్క్రీన్‌ వాడకం కారణంగా టెక్‌ నిపుణులు, టీనేజర్లలో జీవనశైలి రుగ్మతగా అభివృద్ధి చెందుతుందని ప్రిస్టిన్‌ ఐ హాస్పిటల్స్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ సి.జగదీష్‌రెడ్డి అన్నారు.. టియర్‌ ఫిల్మ్‌ అనలైజర్‌, మీబోగ్రఫీ, లిపివ్యూ, తదితర ఆధునిక కంటి చికిత్సా పరికరాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన డాక్టర్‌ చినబాబు తదితరులు

శ్రీదేవి కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్‌ కళాశాల మూడోసారి నేషనల్‌ బోర్డ్‌ ఆఫ్‌ అక్రిడిటేషన్‌ (ఎన్‌బీఏ)గుర్తింపు లభించినట్లు ఆ కళాశాల యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అక్రిడిటేషన్‌ 2025–26 నుండి 2027–28 వరకు చెల్లుబాటులో ఉంటుందన్నారు. ఈ మైలురాయిని సాధించడంలో కీలక పాత్ర పోషించిన కళాశాల సలహాదారు డాక్టర్‌ టి రవీందర్‌ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బందిని యాజమాన్యం అభినందించింది. మూడోసారి అక్రిడిటేషన్‌ కళాశాల ఉన్నత విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నిదర్శనంగా పేర్కొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ హోప్‌ ఆధ్వర్యంలో అన్నదానం


హోప్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అన్న దానం చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: లయన్స్‌ క్లబ్‌ హైదరాబాద్‌ హోప్‌ ఆధ్వర్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్‌ వద్ద బుధవారం అన్న దానం చేశారు. లయన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌ క్లబ్‌ హోప్‌ వ్యవస్థాపక అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ బాబురావు పుట్టిన రోజు సందర్భగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్‌ సభ్యులు మధుసూదన్‌ రెడ్డి, బర్క మల్లేష్‌ యాదవ్‌, సింగదాసరి రాజశేఖర్‌, మారం వెంకట్‌, శాంతి భూషన్‌ రెడ్డి, విష్ణుమూర్తి, రవీందర్‌, డాక్టర్‌ శ్రీనివాస్‌, ప్రసాద్‌, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

మియాపూర్‌: చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. బుధవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌ యాదవ్‌, ఉప్పలపాటి శ్రీకాంత్‌, ఇరిగేషన్‌ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుందరీకరణ, అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించరాదని, నిర్దేశిత కాలవ్యవధిలో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పటేల్‌చెరువు, గంగారం పెద్ద చెరువు సుందరీకరణ పనులు న్యాయవివాదాల కారణంగా నిలిచిపోయాయని, ఆయా వివాదాలను త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. టీడీఆర్‌ తదితర అంశాలను త్వరగా పరిష్కరించి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌ అధికారులు ఎస్‌ఈ శ్రీనివాస్‌, ఈఈ నారాయణ, డీఈ నలిని, ఏఈ లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్‌, శశాంక్‌, నాయకులు రఘునాథ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్‌ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా


టీఎస్‌ నగర్‌ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ అన్నారు. బుధవారం ఆయన డివిజన్‌ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌ కాలనీలో చేపట్టిన సీసీ , బీటీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

టీఎస్‌ నగర్‌లో పాదయాత్ర

డివిజన్‌ పరిధిలోని టీఎస్‌నగర్‌ కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్‌ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రేపర్‌ ఫౌండర్స్‌ ప్రోగ్రామ్‌ ప్రారంభం

- తొలిసారిగా నగరంలో ఏర్పాటు
- దేశవ్యాప్తంగా 14 అత్యుత్తమ స్టార్టప్‌ల ఎంపిక

గచ్చిబౌలి: ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి ఒక మిలియన్‌ ఆంత్రప్రెన్యూర్స్‌ను రూపొందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న గ్లోబల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ ఎకోసిస్టమ్‌ డ్రేపర్‌ స్టార్టప్‌ హౌజ్‌ భారతదేశంలో తొలి డ్రేపర్‌ ఫౌండర్స్‌ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గచ్చిబౌలిలోని డ్రేపర్‌ స్టార్టప్‌ హౌజ్‌ అతిథ్యం ఇస్తోంది. ఈ సందర్భంగా డ్రేపర్‌ స్టార్టప్‌ హౌజ్‌ హైదరాబాద్‌ డైరెక్టర్‌ చైతన్య మాట్లాడుతూ దేశంలో ప్రతిభగల వ్యవస్థాపకులు ఎందరో ఉన్నారని, వారికి సరైన సమయంలో సరైన మద్దతు, అంతర్జాతీయంగా వారి ఉనికిని చాటుకునే అవకాశం, పెట్టుబడిదారుల యాక్సెస్‌ తదితర అవకాశాలను డ్రేపర్‌ ఫౌండర్స్‌ కార్యక్రమం ద్వారా కల్పిస్తున్నామన్నారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు డెమో డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న 14 స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ఎంపికైన పెట్టుబడిదారులు, మెంటర్లు, ఎకోసిస్టమ్‌ లీడర్స్‌కు ప్రదర్శిస్తాయి. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్‌ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఎంపికైన 14 స్టార్టప్‌లు, నిర్వాహకులు వీరే..

మెడ్‌స్కోర్‌–మన్నూరి వంశీకృష్ణ, రెక్సాయిడ్‌–బాసిల్‌ పౌలోస్‌, సాలాహషాట్స్‌–ఆస్థా దర్శిక, ఫిన్‌స్టోన్‌ ఏఐ–రుషికేష్‌ చవాన్‌, కుమ్మా–గౌతమ్‌ పలని స్వామి, ఫిన్‌స్టాక్‌ నితిన్‌రెడ్డి, మైక్రోకాస్మోస్‌ క్రియేషన్‌– డాక్టర్‌ అభిషేక్‌ మణిత్రిపాఠి, న్యూరల్‌ క్రాఫ్ట్‌–నియాస్‌, బ్రికోపే–శుభంషా, గ్లాల్స్‌– శుభం శర్మ, అల్గోజియా–సందీప్‌యామా, వీజ్‌–ఏఐ–నీసా, సయ్యద్‌ అండ్‌ టీమ్‌, లోహాస్‌ స్టేస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌– హర్షా, స్పార్క్స్‌–కార్తీక్‌ నాగపూరి నిర్వహించే స్టార్టప్‌లను ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసి వారికి తగిన శిక్షణ ఇస్తున్నారు.

'సండే ఈవెనింగ్‌ టాక్‌' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌ క్యాంపస్‌లో ఆదివారం 'సండే ఈవెనింగ్‌ టాక్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సదర్భంగా కేర్‌ ఆస్పత్రి ఇంటర్‌వెన్షనల్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ ఆశుతోష్‌కుమార్‌ 'యువర్‌ గైడ్‌ టు ఏ హెల్దియర్‌ హార్ట్‌' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

పీఎం శ్రీ, స్కావెంజర్‌ నిధుల వివరాలు అందజేయాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో పీఎం శ్రీ, స్కావెంజర్‌ నిధుల వినియోగం వివరాలను అందజేయాలని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్యను బుధవారం వై.బసవరాజు కోరారు. స్కూల్‌లో బ్లాక్‌ బోర్డులు అస్తవ్యస్తంగా మారాయని, వాటికి కలర్‌ వేయాలని, విద్యార్థుల అవసరాలకు తగినన్ని మూత్ర శాలలు నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

జిన్నారం(పటాన్‌చెరు): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి ధీమావ్యక్తం చేశారు. బుధవారం బొల్లారం పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక యువకులు భారీ సంఖ్యలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ... ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల పోరుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌ సభ్యులు రవీందర్‌రెడ్డి, మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి మేఘన రెడ్డి, నాయకులు అఖిల్‌, శ్రీకాంత్‌ చారి, అరుణ్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్రాష్ట్ర వాలీబాల్‌ పోటీలు

- తలపడుతున్న అండర్‌–19,17,14 బాలబాలికల జట్లు
- ప్రతి క్లస్టర్‌ నుంచి 48 మంది క్రీడాకారులు
- 400 మంది బాలబాలికలు హాజరు
- నేడు ముగింపు వేడుకలకు ఏర్పాట్లు

రాయదుర్గం: 'వావ్‌ గుడ్‌ షాట్‌.......వెల్‌బ్లాకింగ్‌.... వెల్‌ప్లేసింగ్‌...గుడ్‌ సర్వీస్‌.....గుడ్‌ ప్లే గుడ్‌ప్లే' వంటి నినాదాలు, చప్పట్లతో క్రీడాకారులను విద్యార్థులు ప్రోత్సహిస్తూ వాలీబాల్‌ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌ గోపన్‌పల్లిలోని పీఎంశ్రీ జవహర్‌ నవోదయ విద్యాలయ క్యాంపస్‌లో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్‌ రీజియన్‌ స్థాయి వాలీబాల్‌ పోటీలు కొనసాగుతున్నాయి. అండర్‌–19, అండర్‌–17, అండర్‌–14 బాలబాలికల జట్ల మధ్య వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ లతోపాటు కర్నాటక, కేరళ, పాండిచ్చేరి ప్రాంతాల జవహర్‌ నవోదయ విద్యాలయాల జట్లు పాల్గొంటున్నాయి. ఆయా రాష్ట్రాలలోని యానాం, ఆదిలాబాద్‌, కరైకల్‌ హవేరి, హసన్‌, కలబురిగి, ఎర్నాకులం, కన్నూర్‌ క్లస్టర్ల నుంచి అండర్‌–19, అండర్‌–17, అండర్‌–14 జట్ల బాలబాలికలు పాల్గొంటున్నారు. ఒక్కో క్లస్టర్‌ నుంచి 48 మంది చొప్పున మొత్తం 400 మంది బాల బాలికలు ఈ పోటీల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో విజయం సాధించిన జట్లలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ముందంజలో హవేరి,కరైకల్‌ జట్లు

బాలబాలికలు అండర్‌–19,17,14 జట్లలో లీగ్‌ దశలో 38 మ్యాచ్‌లు జరిగాయి. ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో హవేరి, కారైకల్‌ క్లస్టర్లు మొదటి, రెండు స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్‌ రీజియన్‌ డిప్యూటీ కమిషనర్‌ అభిజిత్‌ బెహరా, అసిస్టెం ట్‌ కమిషనర్‌ ఎస్‌పి బోస్లే, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్‌ వియభాస్కర్‌ అభినందించారు. గురువారం జరిగే పోటీలతో ఈ పోటీలు ముగుస్తాయి. టోర్నీలో ప్రతిభ చాటిన క్రీడా కారులతో హైదరాబాద్‌ రీజియన్‌ జట్లను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు అర్హత కల్పిస్తారు.



వాలీబాల్‌ పోటీల్లో తలపడుతున్న జట్లు